క్లుప్తంగా

దీక్ష విరమణ

కాకినాడ క్రైం: స్థానికంగా సాగునీటి సమస్యను పరిష్కరించాలనే డిమాండ్‌తో కొద్ది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన జనసేన పార్టీ మద్దతుదారులు సూర్యచంద్ర, ఆయన భార్య శ్రీదేవిని పోలీసులు మంగళవారం తెల్లవారుజామున కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. తరలించిన కొద్దిసేపటికి వాటర్ వర్క్ ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ వారికి హామీ ఇచ్చి, నిమ్మరసంతో దీక్ష విరమింపజేశారు.

ఘనంగా ప్రపంచ ఇంద్రజాల దినోత్సవం



ఇంద్రజాల కళాకారుడు సతీష్‌ను సత్కరిస్తున్న అడబాల రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో మంగళవారం ప్రపంచ ఇంద్రజాల దినోత్సవం ఘనంగా జరిగింది. ఇంద్రజాల కళాకారుడు, గిన్నిస్ బుక్‌లో పేరు సంపాదించి, పది నంది పురస్కారాలు అందుకున్న సతీష్‌ను అడబాల రత్నప్రసాద్ సత్కరించారు. సతీష్ మాట్లాడుతూ ఇంద్రజాలం అనేది శతాబ్దాల నుంచి వస్తున్న కళ అని చెప్పారు. ఇంద్రజాల ప్రదర్శనల ద్వారా మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్యవంతుల్ని చేయ వచ్చన్నారు. అనంతరం మ్యాజిక్ షో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రవిశంకర్ పట్నాయక్, చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలనతో జోహార్లు



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ, ఇతర అధికారులు

కాకినాడ క్రైం: పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జ్యోతులు ప్రజ్వలిస్తూ జోహార్లు పలికారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొని ర్యాలీ నిర్వహించారు. జ్యోతులు వెలిగించి అమరవీరులకు నివాళులు అర్పించారు. అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ సహా అధికారులు నివాళులు అర్పించి, నినాదాలు చేశారు. మంగళవారం నాటి కార్యక్రమంతో వారోత్సవాలకు ముగింపు పలికినట్టు ఎస్పీ తెలిపారు.

నేడు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించి జిల్లా స్థాయి వేడుకలు బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రం కాకినాడలోని రామారావుపేట, సీపీఎం స్కూల్ కూడలి వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించనున్నారు. పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించి, జాతీయ పతాక వందనం, గార్డ్ ఆఫ్ హానర్ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

నియామక ఉత్తర్వులు అందజేత



అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో పోషణ అభియాన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేసేందుకు నిర్వహించిన పలు పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి కె.ప్రవీణలతో కలిసి మంగళవారం అందజేశారు. జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఒక పోస్టును, జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ ఒక పోస్టు, బ్లాక్ కోఆర్డినేటర్ల పోస్టులను జగ్గంపేట, శంఖవరం ప్రాంతాలకు ఎంపిక చేసినట్టు చెప్పారు.

బీజేపీ మహిళామోర్చా ధర్నా

బోట్‌క్లబ్: భారతీయ జనతా పార్టీ మహిళామోర్చా ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ భానుగుడి సెంటర్‌లో శాంతియుత ధర్నా నిర్వహించారు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరిపై వైఎస్సార్ సీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, నాయకులు గట్టి సత్యనారాయణ, తుమ్మల పద్మ, లక్ష్మీప్రసన్న, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ

పిఠాపురం: చేబ్రోలులో మంగళవారం మద్యం దుకాణాలను ఎక్సైజ్ డీఎం ప్రసాద్ తనిఖీ చేశారు. మద్యం దుకాణాలలో రికార్డులు పరిశీలించిన ఆయన స్టాకు వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశంపై తనిఖీ చేశారు. అమ్మకాలు ఎలా జరుగుతున్నాయని ఆరా తీశారు. మద్యం అమ్మకాల్లో ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- నీటి నిల్వలతో ప్రమాదం
- ముమ్మరంగా లార్వా గుర్తింపు సర్వే
- దోమల నియంత్రణకు ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాలు



దోమల లార్వాను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

కాకినాడ సిటీ: వర్షాకాలంలో వివిధ రకాల వ్యాధులు మనిషిపై దాడి చేస్తాయి. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయి. దోమకాటు ద్వారా డెంగీ జ్వరం వస్తుంది. దీనిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం. ఈ నేపథ్యంలో వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై అధికారులు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మలేరియా కేసులు తగ్గి ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో డెంగీ జ్వరాలు నమోదవుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. కాకినాడ, తుని, సామర్లకోట, పిఠాపురంల్లో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. కొన్ని గ్రామాల్లో కూడా డెంగీ కేసులు నమోదవుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా కేసులింకా ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. దీంతో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది.

ప్రజలకు అవగాహన

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంటోంది. ఎక్కడైనా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తమవుతున్నారు. సీజన్ మార్పు నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, వలంటీర్లు సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు వ్యాధి లక్షణాలతో పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వచ్చేవారికి వైద్యులు ముందుగా ర్యాపిడ్ పరీక్షలు చేస్తున్నారు. డెంగీ నిర్ధారణ అయితే వెంటనే బాధితులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తున్నారు. అక్కడ ఎలీసా టెస్ట్ నిర్వహిస్తున్నారు. రక్తకణాల సంఖ్య తక్కువగా ఉంటే రక్తం, ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



డెంగీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వైద్యాధికారులు, సిబ్బందికి ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే తొలగించి, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని పంచాయతీ, వార్డు శానిటరీ సెక్రటరీలకు సూచించాం. డెంగీ నిర్ధారణ అయిన ఇంటికి చుట్టుప్రక్కల 50 ఇళ్లలో నీటిని తనిఖీ చేసి, లార్వాలుంటే నాశనం చేస్తున్నాం. ఫ్రైడే, డ్రైడే ద్వారా ప్రతి ఇంటిని సందర్శించి నీరు నిల్వలను తొలగిస్తున్నాం.

– ఎస్ భాస్కరరావు, జిల్లా మలేరియా అధికారి, కాకినాడ

ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలు

సాధారణ జ్వరాలను సైతం డెంగీ పేరుతో ప్రైవేట్ ఆసుపత్రులు దోచుకుంటున్నాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయాయి. అనే సాకుతో అధిక సొమ్ము వసూలు చేస్తున్నారు. డెంగీ వస్తే ప్రభుత్వానికి సమాచారం తెలియజేయాలి. నమూనాలు పంపించాలి. ఇవేమి లేకుండా రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ వసూలు చేస్తున్నారు.

జీపీఎస్ వాహనాలకే అనుమతి



కరపలో ట్రాక్టర్లకు జీపీఎస్ చేస్తున్న ఎంఏఓ రాజేష్, వీఏఏలు

కరప: సార్వా సీజన్‌లో ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైసు మిల్లులకు చేరవేసేందుకు వాహనాలకు జీపీఎస్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంఏఓ ఏవీ రాజేష్ తెలిపారు. కరప, పెనుగుదురు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద మంగళవారం రవాణా చేసేందుకు ముందుకువచ్చిన ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు జీపీఎస్ చేసి, యజమానుల వివరాలు సేకరించారు. సోమ, మంగళవారాల్లో మండల పరిధిలో గుర్తించిన 122 వాహనాలకు జీపీఎస్ చేశామని ఆయన తెలిపారు. జీపీఎస్ చేసిన వాహనాలను మండలంలోని ఆర్‌బీకేల వద్ద అందుబాటులో ఉంచుతామన్నారు. రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని జీపీఎస్ చేసిన వాహనాల ద్వారా రైసు మిల్లులకు చేరవేస్తామని ఎంఏఓ రాజేష్ తెలిపారు. వీఏఏలు ప్రశాంత్, అశోక్‌తేజ పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఓటు హక్కు

- జనవరి 5న ఓటర్ల తుది జాబితా
- ఈఆర్వో నాగనరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న నాగనరసింహారావు

కాకినాడ: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నదే లక్ష్యమని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ నాగనరసింహారావు స్పష్టం చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈఆర్వో నాగనరసింహారావు మాట్లాడుతూ సిటీ పరిధిలో 14,214 ఓట్లను తొలగించినట్టు తెలిపారు. ఇందులో మరణించిన ఓటర్లు 7 వేలు, డబుల్ ఎంట్రీ ఓటర్లు రెండు వేలు, ఇతర నియోజకవర్గాలకు వెళ్లిపోయిన ఓటర్లు 4 వేలు ఉన్నాయని వివరించారు. ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగానే కొత్త ఓటర్ల నమోదు స్వీకరణ నుంచి మార్పులు, చేర్పులు, తొలగింపులు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఆచూకీలేని (నాన్ ట్రేస్డ్) ఓటర్లకు సంబంధించి పోస్టల్ ద్వారా రిజిస్టర్డ్ పోస్టులో నోటీసులు పంపించామని, తిరిగి వచ్చిన నోటీసులను మరోసారి బీఎల్‌వోలు ద్వారా పునర్విచారణ చేసి నిర్ణయం తీసుకుంటామన్నారు.

నాలుగు రోజుల ప్రత్యేక శిబిరాలు

ఓటు నమోదు, మార్పులు, చేర్పుల కోసం నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు ఈఆర్వో నాగనరసింహారావు చెప్పారు. ఆ శిబిరాల్లో ఫారం–6, 7, 8లకు సంబంధించి చేసుకునే దరఖాస్తులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురించామన్నారు. కాకినాడ సిటీ పరిధిలోని 233 పోలింగ్ స్టేషన్లు, ఈఆర్వోలు, కార్పొరేషన్ కార్యాలయంలో ముసాయిదా జాబితా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్ల తుది జాబితాను 2024 జనవరి 5న ప్రచురిస్తారని వెల్లడించారు. ఓటర్ల సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఈ ఆర్వో, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎంవీ మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ ప్రతినిధి రావూరి వెంకటేశ్వరరావు, టీడీపీ ప్రతినిధి ఒమ్మి బాలాజీ, బీఎస్పీతో పాటు వివిధ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

ఆంజనేయరెడ్డికి డొక్కా సీతమ్మ కీర్తి పురస్కారం



అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న ఆంజనేయరెడ్డి

కాకినాడ రూరల్: కాకినాడకు చెందిన సామాజిక కార్యకర్త అనపాల ఆంజనేయరెడ్డికి డొక్కా సీతమ్మ కీర్తి పురస్కారం లభించింది. అమలాపురంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టరు హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అపర అన్నపూర్ణ, నిత్య అన్నదానకర్త డొక్కా సీతమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె పేరిట ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారన్నారు. సాంస్కృతిక, సామాజిక, సాహిత్య, కళారంగాలతో పాటు విభిన్న రంగాలలో విశేష ప్రతిభ కనబర్చిన వారికి పురస్కారాలు ప్రదానం చేయగా, సామాజిక సేవా రంగంలో తనకు పురస్కారం ఇచ్చారన్నారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట భవానీ కాస్టింగ్ వద్ద పిఠాపురం – కాకినాడ రోడ్డులో ప్రయాణికులను ఏడాది పొడవునా చలివేంద్రం ఏర్పాటు చేసి ఆంజనేయరెడ్డి ప్రయాణికుల దాహార్తిని తీరుస్తూ.. ఇప్పటికే పలు పురస్కారాలు అందుకున్నారు. కేవలం ప్లాస్టిక్ సామాన్లు అమ్ముతూ, వచ్చే కొద్దిపాటి ఆదాయాన్ని ఆయన సేవా కార్యక్రమాలకు వినియోగంచడాన్ని పలువురు అభినందిస్తున్నారు.

త్వరలో ఆదివాసీ ఏకతా పరిషత్ మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎరుకల సంఘ నాయకులు

కాకినాడ సిటీ: ఆదివాసీ ఏకతా పరిషత్ మహాసభ ఆదివాసీ తెగల కోసం 1965లో లోకూరు ప్రకటించిన సిఫార్సులను అమలు చేయాలని జాతీయ ఆదివాసీ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఘన్‌శ్యామ్ అలామే, ఆలిండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు వలిగి ప్రభాకర్ డిమాండ్ చేశారు. కాకినాడ రామారావుపేటలో ఉన్న జెడ్పీ కల్యాణ మండపంలో రాష్ట్రీయ ఆదివాసీ ఏకతా పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభ జిల్లా ఏఐవైహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆదివాసీ ఏకతా పరిషత్ మహాసభను కాకినాడలో నిర్వహిస్తారన్నారు. రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కుల సాధన కోసం ఉద్యమాలకు శ్రీకారం చుడతారన్నారు. రాష్ట్రంలోని గిరిజనేతర కులాలను గిరిజనులుగా గుర్తించాలని 2017లో ప్రొఫెసర్ పీడీ సత్యపాల్ కమిషన్ రిపోర్ట్‌ను బహిర్గతం చేయాలని కోరారు. 2002–2004లో దిలీప్‌సింగ్ భూరియా కమిషన్ రిపోర్టు ద్వారా గిరిజన తెగల అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. అర్హతలేని గిరిజనేతర కులాలను గిరిజన జాబితాలో చేర్చరాదని, మైదాన ప్రాంతంలోని ఎరుకల తెగ ప్రజలకు 2022 డిసెంబర్ నుంచి వైరస్ ద్వారా చనిపోయిన దేశవాళీ పందులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎరుకల సంఘ నాయకులు అమలదాసు నూకరాజు, ద్రాక్షం శ్రీనువాసులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు దోకుబుర్ర భద్రం పాల్గొన్నారు.

వేడుకగా అట్లతద్ది పూజలు



ఇంద్రపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద కోనేరులో మహిళల పూజలు

కరప: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం అట్లతద్దిని వేడుకగా నిర్వహించారు. కొత్త పెళ్లికుమార్తెలు, మహిళలు తెల్లవారుజాము నుంచే వీధుల్లో కలియతిరుగుతూ, ఆటపాటలతో సందడి చేశారు. సాయంత్రం వరకు ఉపవాసమున్నారు. కొన్ని గ్రామాల్లో యువతులు, చిన్నారులు పగలు ఉయ్యాల ఊగుతూ సందడి చేశారు. తద్దిచేసిన మహిళలు ఇంటింటికీ తిరుగుతూ తాంబూలాలిచ్చి, పెద్దల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. సాయంత్రం కాగానే బావుల వద్దకు, కాలువగట్ల వద్దకు వెళ్లి గౌరీపూజ చేశారు. వాయినాల అట్లతోను, జాజాలతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కొత్తగా పెళ్లయిన వారు పేరంటాళ్లకు వాయినాలిచ్చి, ముత్తయిదవల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు.

గౌరీదేవీ కటాక్షించూ..

కాకినాడ రూరల్: తమ ఐదోతనం చల్లగా ఉండాలని గౌరీదేవీ ఆశీర్వచనం కోసం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో అట్లతద్దె నిర్వహించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో మంగళవారం అట్లతద్దె నోమును ఘనంగా ఆచరించారు. ఉదయం తమ ఇళ్ల వద్ద అట్లను సంప్రదాయబద్ధంగా తయారు చేసి, నోములు తీర్చుకున్నారు. సాయంత్రం చెరువులు, కాల్వల వద్ద పాలలో గౌరమ్మ, నీలలో గైరమ్మ అంటూ దీపారాధనలతో పూజలు నిర్వహించారు. ఇంద్రపాలెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద కోనేరులో నీటిని నింపడంతో మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి గంగమ్మను పూజించారు. కొత్తగా పెళ్ళిళ్ల అయినవారు ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చి తీర్చుకున్నారు.



కరపలో కాలువ గట్టు వద్ద గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు

అన్నవరానికి కాలినడకన బయలుదేరిన భక్తులు

కరప: మండలం వాకాడ నుంచి అన్నవరం సత్యనారాయణస్వామిని దర్శించుకునేందుకు మంగళవారం తెల్లవారుజామున భక్తులు కాలినడకన బయలుదేరి వెళ్లారు. వాకాడ గ్రామానికి చెందిన పులి రాంబాబు(ప్రవాసాంధ్రుడు), దూడల బాపన్న, కామిరెడ్డి సురేష్, లకమన సాయినాథరావు, శీలం వెంకన్న, లకమన రాంబాబు, సింగం కృష్ణార్జున, బృందావన సత్యనారాయణ గ్రామంలోని శివాలయంలో పూజలు చేసి బయలుదేరారు. కరపలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద పూజలు చేసి, అన్నవరంలోని స్వామిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకునేందుకు వెళ్లారు.

ఐక్యతే పటేల్ అభిమతం



ఐక్యత పరుగులో పాల్గొన్న ఎస్పీ, అధికారులు

కాకినాడ క్రైం: సర్దార్ వల్లభాయి పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ శాఖ ఘనంగా నిర్వహించింది. మంగళవారం ఐక్యత పరుగును నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ సహా అధికారులు, సిబ్బంది, పలువురు విద్యార్థులు ఈ పరుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఐక్యతే పటేల్ అభిమతమన్నారు. ఆయన స్ఫూర్తిని నేటి తరం అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.

సర్దార్ పటేల్‌కు ఘన నివాళులు

కరప: మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జాతీయ ఏక్తా దివస్ సందర్భంగా పటేల్ చిత్రపటానికి నివాళులర్పించి, ప్రతిజ్ఞ చేసినట్టు ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.అప్పారావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు సిబ్బందితో పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. నేటి తరం యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. జాతీయ సమైక్యతకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. డీటీ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ పి.మాచరావు, ఏఓ గుత్తుల భీమశంకరరావు, టి.సురేష్, వి.వీరేష్, జీజీ చినరాయుడు, గురజనాపల్లిలో హైస్కూలులో హెచ్‌ఎం ఏ.సాయిమోహన్, ఉపాధ్యాయులు పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, రొక్కాల గణేష్, మార్గెళ్ల శ్రీనివాస్(శివ), వాసంశెట్టి శ్రీనుబాబు, బొమ్మిడి నయోమి, వాసంశెట్టి రామారావు, కమిడి మంగాదేవి, అడబాల సత్య, రెడ్డిపల్లి వెంకటమాధవి, చింతా నాగలక్ష్మి, పలివెల నాగేశ్వరరావు, కార్యదర్శులు ఎస్కే నాగేంద్రకుమార్, పి.వీరభద్రరావు, పీఎస్ఆర్ బ్రహ్మానందం, పి.శ్రీనివాస్, పి.ఉమామహేశ్వరి, డి.దుర్గాభవాని, ఎం.చక్రపాణి తదితరులు పటేల్‌కు నివాళులు అర్పించారు.

ఏపీఎస్పీలో ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం



ఏపీఎస్పీలో పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ కమాండెంట్ భద్రయ్య



రన్ ఫర్ యూనిటీ నిర్వహిస్తున్న ఏపీఎస్పీ సిబ్బంది



రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో ఏపీఎస్పీ మూడో బెటాలియన్‌లో జాతీయ ఐక్యత దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి అడిషనల్ కమాండెంట్ సీహెచ్ భద్రయ్య పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. సిబ్బందితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎల్.అర్జున్, ఆర్ఐలు సురేష్‌బాబు, శ్రీనివాసరావు, రాము, సతీష్, రవిశంకర్, ట్రైనీ డీఎస్పీలు పాల్గొన్నారు.

ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో రన్ ఫర్ యూనిటీ

కాకినాడ రూరల్: భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో మంగళవారం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ జెండా ఊపి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు డాక్టరు ఎం.శ్రీదేవి ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టరు డి.అజయ్ రతన్, డాక్టరు హారిక, డాక్టరు అప్పారావు, రాధామాధవి, వరప్రసాద్ పాల్గొన్నారు.

రన్ ఫర్ యూనిటీ ర్యాలీ

బాలాజీచెరువు: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆలిండియా ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఐక్యత దినోత్సవం జరిపారు. ఇందులో భాగంగా మంగళవారం జేఎన్‌టీయూ కాకినాడ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రన్ ఫర్ యూనిటీ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. జేఎన్‌టీయూకే ప్రధాన ద్వారం నుంచి భానుగుడి మీదుగా తిరిగి జేఎన్‌టీయూ కళాశాల వరకూ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్, పీవో రమణాజీ పాల్గొన్నారు.

సూర్యారావుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష



వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట గ్రామంలో సచివాలయం–1 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. మొత్తం 436 మందికి వైద్య సేవలు అందించారు. కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.రాజ్‌కుమార్ పర్యవేక్షణలో వైద్య సేవలందించారు. ఈ ఆరోగ్య సురక్షా శిబిరాన్ని సర్పంచ్ సూరాడ చిన్ని, తహసీల్దార్ మురార్జీ, గ్రామ నాయకుడు సూరాడరాజు తదితరులు సందర్శించారు. పందూరు పీహెచ్‌సీ వైద్యులు ఆయేషా ఫాతిమా, సామియా సుల్తాన్, ప్రత్యూష, నివేదిత, మహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

